THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

# రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల సువార్త ప్రసారములు

తె లు గు — SATYA VANI

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

హిం దీ — SATYA SUSAMACHAR

మంగళవారము
గురువారము
శుక్రవారము } 9.00 to 9-15 p. m.

శనివారము — 1-30 to 1-45 p. m.

ఇం గ్లీ షు — The Voice of Truth

ఆదివారము —9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

త మి ళ ం — SATYA VAZHI

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

మ ళ యా ళ ం — The Voice of Truth

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.

తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**S A T Y A V A N I**
P. O. Box 80, KAKINADA-533 001

---

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* J. C. CHOATE

*Managing Editor* JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity

సంచిక **4** నవంబరు **1981** సంపుటి **2**


## సంపాదకీయము

### మీ యోచన లేమిటి?

*( What are your Plans ? )*

బైబిలును చదువుచుండగా, తన ప్రజలను గూర్చి దేవుడు చేయు యోచనలను మనము మనసునం దుంచుకొనగలము. ఇశ్రాయేలీయులే గాక తన్ను వెంబడించు వారిని గూర్చి ఆయన యోచించుచుండెను. ఆయన తన కుమారుడైన యేసుక్రీస్తును పంపించుటకును, ఆయనద్వారా ఒక ఆత్మీయ రాజ్యమును అనగా సంఘమును స్థాపించుటకును ఆయన వాగ్దానము చేసెను.

దేవుడు తన యోచనల నెట్లు నెరవేర్చెనో తెలిసికొనుట ఆసక్తికరముగా యుండును. వాగ్దానము చేయబడి ప్రవచింపబడిన రీతిగా క్రీస్తు వచ్చెను (ఆది 3:15; యెషయా 53; మత్తయి 1). ఆయన మానవుల మధ్య జీవించి త్వరలో సంభవింపబోవు సంగతులను గూర్చి అపొస్తలులను సిద్ధపరచెను. ఈ లోక పాపముల కొరకు ఆయన సిలువపై

చనిపోయెను. మరియు రాజ్యము లేక సంఘము స్థాపించబడెను. ఇదంతయు బైబిలు ప్రకారమే జరిగెను (యోహాను 3:16; మత్తయి 16:18, 19; అపొ. కా. 2).

దేవుని ఇతర యోచనలు ఉండెను. ప్రభువు క్రమముగా వాటిని నెరవేర్చ సాగెను. నిశ్చయముగా వీటిలో ఏదియు గలిబిలిగా గాని, అకస్మాత్తుగా గాని జరుగలేదు. ఆలస్యమైపోయినందువలనగాని, అనుకొనని రీతిగా వేరొకటి సంభవించుటవలన గాని ఆయన ఎన్నడు తన సంకల్పమును మార్చనవసరము లేకపోయెను.

ఒక క్రైస్తవునిగా, బోధకునిగా, సంఘముగా మీ యోచన లేమిటి? అని యడుగుటకు ఈ సంగతులను మీకు సూచించితిని. ఏవిధమైన సంకల్పము లేకుండ మన సహోదరులలో ఎక్కువమంది తమ జీవితమును గడుపుచున్నారు. సాధించుటకు ఏవిధమైన లక్ష్యము వారికి లేదు. వారు రోజు రోజుకు జీవించుచు జరిగే సంగతులను జరుగనిచ్చుచునే యుందురు. తత్ఫలితముగా వారు సాధించేది ఏమియు ఉండదు.

ఒక పాఠశాలగాని, వ్యాపారముగాని, ప్రభుత్వముగాని మరింకేదైనగాని ఏవిధమైన లక్ష్యము లేకుండ, భావిని గూర్చి తలంపులు లేకుండ యుండుట ఆలోచించుము. నిజానికి వారట్లు పనిచేయరు. అలా చేసిన యెడల త్వరలోనే వారు విఫలులగుదురు. ప్రభువు బిడ్డలమైన మనము ఈలోకసంబంధులవలె ఎందుకు తెలివి కలిగియుండలేము? (లూకా 16:8).

సువార్త బోధకునిగా నీవు భవిష్యత్తును గూర్చి సిద్ధపడవలెను. నీకొక ఉద్యోగమున్నదని, జీతము వచ్చుచున్నదని అనుకొనుట చాలదు. వీలైనంతమట్టుకు నీవు విద్య నభ్యసించుట, బహుశ ఒక బైబిలు పాఠశాలలో తర్ఫీదు పొందుట మంచిది. వీటన్నిటికిపైన నీవు వ్యక్తిగతముగా బైబిలును ధ్యానించు సమయమును కలిగి యుండుట

అత్యవసరము. నీవు దేవుని వాక్యమును తెలిసికొనకుండా నీ పనిని సరిగ చేయుట అసంభవము. నీవు ఒక స్థానిక సంఘముతోగాని లేదా ఎక్కువ సంఘములతోగాని పనిచేయుచున్న యెడల నీవు బోధించు గ్రామములలో సాధ్యమైనంత మట్టుకు ఎక్కువ వ్యక్తిగత సువార్త పనిచేయవలెను. సభ్యుల గృహములలోను, సభ్యులు కానివారి గృహములలోను నీవు బైబిలు పఠనము జరిగించవలెను. మీ స్థానిక సంఘములో ఆరాధనకు ముందు బైబిలు తరగతిని నడిపించుటకు స్థానిక సహోదరులను ప్రోత్సహించవలెను. ఆరాధనకు హాజరగువారి సంఖ్యను బట్టి పెద్దలకు, పిన్నలకు వేర్వేరు బైబిలు తరగతులను నడిపించవలెను.

నీవు ఏరకమైన ప్రసంగములను చేయుచున్నావు? నీవు ఏకి రకాల అంశములను గూర్చి బోధింతువా? నీవు ఆత్మలను మార్పు చేయడానికి ప్రయత్నింతువా? నమ్మకముగాలేని సభ్యులు ప్రభువు నొద్దకు తిరిగి వచ్చునట్లు వారిని ప్రోత్సహించుచున్నావా? మీ ప్రాంతములో యున్న సువార్తికులతో నీవు సహవాసము కలిగి యున్నావా? సువార్త బోధించుటకు సంఘములో యున్న యౌవనులను నీవు ప్రోత్సహించుచున్నావా? మీ సంఘములో స్త్రీల కూటము జరుగుచున్నదా? మీ పరిసర గ్రామములకు క్రీస్తు సంఘము వ్యాపించేటట్లు నీవు సహాయపడుచున్నావా?

స్థానిక సంఘముగా మీరు దిట్టమైన నాయకులను సిద్ధపరచుచున్నారా? సంఘ కార్యాచరణ కూటమును (Business meeting) మీరు క్రమముగా నడిపించుచున్నారా? 1 తిమోతి 3, తీతు 1 ప్రకారము పెద్దలు పరిచారకులుగా కొందరు తయారు కాగల్గునట్లు మీరు ప్రయత్నించుచున్నారా?

మీ స్వంత ఆరాధన స్థలమును కలిగి యున్నారా? లేని యెడల ఒక దానిని నిర్మించుకొనుటకు ప్రయత్నించుచున్నారా? మీరు

స్వయం పోషకులా? లేని యెడల అట్లు కాగల్గునట్లు కృషి చేయుచున్నారా? మీ బోధకుని నుండి మీ రేమైనా కోరుదురా? అతడు సత్యమునే బోధించునట్లు మీరు జాగ్రత్త కలిగి యున్నారా? (1 యోహాను 4:1).

ధర్మకార్యములు చేయు యోజన మీ కేమైనా యున్నదా? ఒక స్థానిక సంఘముగా మీరు మీ సభ్యులను, గ్రామ సభ్యులను బాగుగా ఎరిగినవారై యుండవలెను. వారి ప్రత్యేకావసరములలో మీరు సహాయపడుటకు అప్పుడు వీలగును. ఇది వారి అవసరము మీదను, దానిని పొందుటకు వారి అర్హత మీదను, దానిని తీర్చుటకు మీ స్తోమత మీదను ఆధారపడి యుండును.

మీ స్థానిక సంఘాభివృద్ధి కొరకు, మీ ప్రాంతములో సువార్త వ్యాప్తికొరకు మీ యోజన యేమిటి? ఇందు నిమిత్తము వివారేమైనా యోచించుచున్నారా? ఈ కార్యక్రమములో సంఘ సభ్యుల నందరిని కలుపుచున్నారా?

మీరు క్రమ శిక్షణ నవలంబించుచున్నారా? ఇది సభ్యులకు సహాయము చేయుటకే గాని వారిని నెట్టివేయుటకు కాదు. ఇది అవలంబించబడనిచోట సభ్యులు తమ ఇష్టము వచ్చినట్లు వారు జీవించుచు ఇంకా నమ్మకమైన సభ్యులుగానే పరిగణింప బడగోరుదురు. సంఘము పవిత్రముగా ఉంచబడవలెను. ఒకడు బహిరంగముగా పాపము చేసిన యెడల అతడు మారుమనస్సు పొంది దేవుని నుండియు, సంఘము నుండియు క్షమాపణ కోరవలెనని ప్రభువు చెప్పుచున్నాడు. అతడట్లు చేయని యెడల సంఘసభ్యు డొకడు అతని దగ్గరకు వెళ్ళి తన జీవితము నతడు సరిదిద్దుకొనునట్లు అతనిని ప్రోత్సహించ వలెను. అతడు అట్లు చేయని యెడల ముందు వెళ్ళిన సభ్యునితో ఒక రిద్దరు సభ్యులు అతని యొద్దకు వెళ్లి హెచ్చరించ వలెను. అత డింకను నిరాకరించిన యెడల,

అతని సంగతి సంఘము యెదుట ఉంచవలెను. అయినను అతడు తన జీవితమును మార్చుకొనని యెడల సంఘము అతని నుండి తొలగి పోవలెను. అపొ. కా. 8; యాకోబు 5:16; మత్తయి 18:15-17 లను చదువండి. ఇటువంటి విషయములను అనేకసార్లు మనము నిర్లక్ష్యము చేయుదుము అందువలన దానిని తరువాత సరిజేయుట కష్ట మగును. అన్ని విషయములలోను దేవుని సంకల్పము ననుసరించుట యుక్తము.

సంఘ సభ్యునివలె నీవు సంఘకూటము లన్నిటికి హాజరగుదువా? (అపొ. కా. 20:7; హెబ్రీ 10:25). ఒక భర్తవలె, తండ్రివలె నీ భార్యా బిడ్డలను ఆరాధనకు తీసికొని వెళ్లుదువా? నీవు అభివృద్ధి జెందిన ప్రకారము నీ కానుకలను సమర్పించెదవా? ప్రభువు పనిలో నీవు ఏవిధముగా సహాయ పడుచున్నావు? నీ స్నేహితులలో ఎవరికైనా సువార్త చెప్పుటకు నీవు ఎన్నడయినా ప్రయత్నము చేసావా? లేక వారిని కూటములకు ఎన్నడయినా ఆహ్వానించావా?

క్రీస్తు సువార్త వ్యాప్తికొరకు ఏమియు సాధించకుండ నీ జీవితమును గడుపుటకు ప్రయత్నించ వద్దు. ఒక క్రైస్తవునిగా ప్రభువు నీపై ఆధారపడి యున్నాడని గుర్తుంచుకొనుము. నీవు పనిచేయని యెడల ప్రభువు పని జరుగదు.

నీవు సిద్ధపడి, క్రమ శిక్షణ గలిగి, నీ సమయమును తరుణములను జ్ఞానయుక్తముగా ఉపయోగించవలెనని మిమ్మును ప్రోత్సహించ గోరుచున్నాను. తరుణములు లేని యెడల వాటిని కల్పించు కొనుము. కొందరు పనులు చేయించుదురు, వారు విజయమును సాధించుదురు. మరి కొందరు ఏమియు సాధించక నిష్ఫలులగుదురు. ఎందువలన? దీనికొక కారణ ముండవలెను. దీనికి విశ్వాసము, ఉత్సాహము, పట్టుదల, కృషి అవసరము. మానసికముగను, శారీరకముగను బద్ధకము గలవారు త్రోవ ప్రక్కన పడిపోదురు.

మీరు కొన్ని యోచనలు చేయండి, కొన్ని గమ్యములను ఏర్పరచుకొనండి. వాటిని సాధించుటకు కృషి చేయండి. నీవు ఒక బోధకుడవైనను, సంఘనాయకుడవైనను, సామాన్య సభ్యుడవైనను సరే నీవు దీనిని చేయుట అవసరము. నీవట్లు చేసిన యెడల ప్రభువు కొరకు నీవు సాధించగలిగిన దానిని బట్టి ఆశ్చర్యపడుదువు. నీవేర్పరచుకొనిన లక్ష్యమును సాధించిన తరువాత దానికంటె ఉన్నతమైన లక్ష్యమును మరియొక దానిని నిర్ణయించుకొనుము. ఫలితము సాధించుటకొరకు నిన్ను నీవే సవాలు చేసుకో. నీవు విజయమును పొందుటకు సహాయకరముగా ప్రభువు సహోదరులు ఉన్నారు. నిన్ను బలపరచు క్రీస్తులో నీవు సమస్తము సాధించగలవని జ్ఞాపక ముంచుకొనుము (ఫిలిప్పీ 4:13).

---

## బైబిలు యొక్క దైవావేశము-2

## ( *The Inspiration of the Bible* )

—**B. C.** గుడ్‌పాశ్చర్

బైబిలునందుపయోగింపబడిన దైవావేశము యొక్క భావ మేమిటి? దైవావేశమువలన ప్రతి లేఖనము కలిగెనని పౌలు చెప్పెను (2 తిమోతి 3:16,17). ఈ మాటలలో లేఖనములను గూర్చి అతడు ఉద్దేశించిన దేమిటి? ఆవేశము, లేక ప్రేరణ (**Inspiration**) అనగా నిజానికి ఊపిరి ఊదుట యని అర్థము. **In and spiro** అను రెండు లాటిన్ పదముల నుండి అది ఉద్భవించినది. ఊదుట, ఊపిరి ఊదుట యని వాటి యర్థము. ఆదిమ గ్రీకు భాషలో **Theopneustous** అను పదము ఉపయోగింపబడెను. అందులో కూడ రెండు పదము లున్నవి. **Theos** అనగా దేవుడు **Pneustous** అనగా ఊదెను అని యర్థము. **Pneo** అను క్రియ నుండి **Pneuma** అనగా ఆత్మ యను పదము

వచ్చినది. అందువలన Theopneustous అనగా దేవుడు ఊదెను లేక దేవుని ఊపిరితో నింపబడెనని యర్థము లేదా ఆత్మ ద్వారా దేవునిచే ఈయబడెను, దేవుని ఆత్మ యొక్క పని (ఫలము) అని యర్థము. 'మానవాతీతమైన ఫలితములను కనబరచుటకు బయట నుండి ఉపయోగింపబడిన ప్రభావము' అనే భావము ఈ మాటలో యున్నది (Miller). ఈ భావము చొప్పున ప్రేరేపింపబడిన గ్రంథము వేరొక ఆత్మ యొక్క ప్రేరేపణ చొప్పున వ్రాయబడినట్టిది. ఇంకొక మాటలో దాని గ్రంథకర్త తానుగాక వేరొక శక్తివలన నింపబడినవాడు. దైవావేశము అనగా బైబిలు లేఖకులు దేవుని చిత్తము నందుకొని లిఖించుటలో పొరబాట్లు లేనివారుగా యుండునట్లు పరిశుద్ధాత్మనిద్వారా వారిపై దేవుడు ఉపయోగించిన ప్రభావమని యర్థము. అయితే బయల్పాటుకును (Revelation) దైవావేశముకును (Inspiration) భేద మున్నది.

పరిశుద్ధ లేఖకుల మాటలు, వారి తలంపులుకూడ ఆత్మప్రేరితమై యుండెను. యేసు ఈ రకమైన ఆత్మావేశమునే వాగ్దానము చేసెను. అపొస్తలులు ఏమి చెప్పవలెనో ఎట్లు చెప్పవలెనో వారికి పరిశుద్ధాత్మను బోధించునని ఆయన చెప్పెను. 'ఏమి చెప్పవలెనో' అనునది వారి తలంపులు. 'ఎట్లు చెప్పవలెనో' అను దానిలో వారు పలుకు మాటలు, ఉపయోగించే పదజాలము ఇమిడి యున్నవి. ఇది వాక్యార్థక ఆత్మావేశము (Verbal Inspiration). నాకు పలికే పలుకులను నడిపించకుండా దేవుడు నా తలంపుల నెట్లు నడిపించగలడో ఆధునిక వేత్తలు మనకు చెప్పగలిగితే బాగుండును. మాటలు లేకుండా తలంపుల నెట్లు వ్యక్తపరచ గలము? మాటలు లేకుండా ఎట్లు సంభాషించగలము? యేసు ఇట్లు చెప్పెను: "ఆకాశమును భూమియు గతించి పోయిననే గాని ధర్మశాస్త్ర మంతయు నెరవేరువరకు దాని నుండి

యొక పొల్లయినను ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 5:18). అట్లు ఆయన వాక్యార్థక ప్రేరణను వక్కాణించుచు లేఖనములలోని మాటలు నాశనము కావని గ్యారంటీ యిచ్చుచున్నాడు. ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి ఒక పొల్లయినను, ఒక సున్నయినను తప్పిపోదు. "మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో కాక ఆత్మసంబంధమైన సంగతులను ఆత్మ నేర్పు మాటలతో తాను బోధించినట్లు పౌలు పలికెను (1 కొరింథీ 2 : 13). వాక్యార్థక దివ్యప్రేరణను గూర్చిన భావాత్మక ఆరోపణ యిది. దీనిని కాదనుట పౌలును దోషారోపణ చేయుటయే. ఒక సంఖ్యను గూర్చి చెబుతూ పౌలు గలతీ 3:16లో ఇట్లు తర్కించెను : "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు—సంతానమునకును అని చెప్పక ఒకనిగూర్చి అన్నట్టు—నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తు". ఈ సందర్భములోని మాటలు దైవప్రేరణ వలన కలిగినవి కాని యెడల పౌలు చేసిన వాదము బలహీనమైనది మరియు రక్షణీయము కాదు.

బైబిలు లేఖకులను పరిశుద్ధాత్ముడు ప్రేరేపించినను వారు తమ వ్యక్తిగత పూర్వచరిత్ర (back-ground), వ్యక్తిత్వము, పదజాలము, శైలి నుపయోగించుటలో స్వేచ్ఛ కలిగి యుండిరి. "దివ్యప్రేరణలో మానవ మనశ్శక్తి అణచివేయబడుట గాని లేక త్రోసి పుచ్చబడుట గాని జరుగదు. వ్యక్తిగత మానవలక్షణముల నుపయోగించుటలో అది అంతరాయము కలుగజేయదు. ఒక హెబ్రీయుడు దివ్యప్రేరణ కలిగిన యెడల అతడు హెబ్రీభాషలో మాటలాడెను; గ్రీకువాడు గ్రీకు భాష మాట్లాడెను; విద్యావంతుడైన యెడల అతడు సాంస్కృతి కలిగిన వానివలె మాటలాడెను. విద్యాహీనుడైన యెడల మాటలాడుట రానివానివలె మాటలాడెను. అతని జ్ఞానము న్యాయానుసారమైన

దయిన యెడల పౌలు వలె అతడు తర్కించెను; భావోద్రేకుడై చింతా శీలుడైన యెడల అతడు యోహాను వ్రాసినట్లు వ్రాసెను". వారి ప్రేరణ కేవలము యాంత్రికము కాదు. బైబిలులో యాంత్రికమైన లేక యాంత్రికముగా కనబడుచున్న దివ్య ప్రేరణ సంఘటనలు కొన్ని కానవగును. అయితే అవి నియమానుసారమైనవి గాక అసాధారణ మైనవే. బిలాము యొక్క గాడిద మాటలాడి నప్పుడది యాంత్రికము; మరియు పెంతెకొస్తునాడు అన్యభాషలలో అపొస్తలులు మాటలాడి నప్పుడది యాంత్రికము. లేదా యాంత్రికమునకు సన్నిహితము. గ్రంథకర్తలు లేఖకులు గాక దేవుని చేతిలో కేవలము కలములే అయి యుండిన యెడల బైబిలు యొక్క శైలి, పదజాలము ఒకే విధముగ యుండును. అయితే అది అట్లు జరుగలేదు. ఉదాహరణకు మత్తయి, మార్కు, లూకా, యోహానుల వ్రాతలను గైకొనుము. వారి యొక్క పద్ధతి, శైలి, విచిత్రవైఖరి మొదలగునవి బాహాటముగా భిన్నముగా యున్నవి. మత్తయి ఒక యూదుడు. అతడు యూదుల పూర్వచరిత్రను బట్టి వ్రాసెను. యేసు చెప్పిన వాటిని గూర్చి అతడు విపులముగా వర్ణించెను. పాతనిబంధన గ్రంథము నుండి ఉద్ధృత వాక్యములను తరచు ఉపయోగించెను మరియు మిగతా లేఖకులు 'దేవుని రాజ్యము' గూర్చి వ్రాయగా అతడు 'పరలోక రాజ్యము' గూర్చి వ్రాసెను. మార్కు యేసు చేసిన ఘనకార్యములను వర్ణించెను. అతడు 'వెంటనే' అను పదమును పలుమారులు ఉపయోగించెను. లూకా ఒక అన్యుడు మరియు వైద్యుడు. ఒకడు, ఒకనాడు అను పదముల నతడు తరచు వినియోగించెను. తన వ్రాతలలో తన వైద్యవృత్తి గోచరమగుచునే యున్నది. ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుటకంటె సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని యేసు చెప్పినప్పుడు మత్తయి, మార్కులు **raphis** అను మామూలు సూది అనే అర్ధమిచ్చు గ్రీకు పదమును వాడిరి; అయితే **belone** అను వైద్యుని

సూది అనే అర్థమిచ్చు పదమును లూకా వాడెను (మత్తయి 19:24; మార్కు 10:25; లూకా 18:25). జలోదర రోగము గల వానిని గూర్చి చెప్పుచున్నప్పుడు, "జలోదర రోగము గల యొకడు" అని లూకా వ్రాసెను (లూకా 14:2). గ్రీకు వైద్యులు సామాన్యముగా వినియోగించు **hudropikos** అను పదము నతడు వినియోగించెను. అది క్రొత్త నిబంధనలో వేరొక చోట ఎక్కడా కనబడదు. మిగిలిన లేఖకులు చెప్పనటువంటి అనేక సంగతులను గూర్చి యోహాను వ్రాసెను. నిశ్చయముగా **(verily, verily)** అను పదమును అతడు ఇరవై అయిదుసార్లు వినియోగించెను. ఈ ధోరణిని వినియోగించిన లేఖకుడు అతడొక్కడు మాత్రమే. దివ్య ప్రేరిత లేఖకులలో వ్యక్తమగు వివిధ శైలిని, పద్ధతిని తెలియ జేయు అనేక ఉదాహరణలను మనము చూపించవచ్చును. డాక్టరు విలియం ఈవన్స్ యుక్తముగా ఇట్లు చెప్పెను. "దేవుని పక్షమునుండి ఆయన ప్రసారము చేయ తలంచిన దానిని పరిశుద్ధాత్ముడు మానవుల ద్వారా విపులముగను, నమ్మకముగను ప్రసాదించినను, మానవ పక్షమునుండి ఆ వర్తమానము మానవులు సహజముగ ఎన్నుకొనిన భాషలో వ్యక్తపరచబడెనని మనము సంగ్రహించుకొనవలెను. అందు వలన మనము సంపూర్ణ వాక్పూర్వక దివ్యప్రేరణ యందు విశ్వాస ముంచుచున్నామని నిరభ్యంతరముగా చెప్పుకొనవచ్చును; అనగా దేవుని ఆత్మ ప్రభావమువలన తలంపులు, మాటలు కూడ మాధ్యస్థముగాగాని, తక్షణమేగాని ఈయబడెను." మొదటి స్థానములో అది సత్యజ్ఞానమును ప్రసాదించలేదు. పౌలు దివ్యప్రేరణ కలవాడే అయినను కొరింథులో ఎంతమందికి అతడు బాప్తిస్మమిచ్చెనో ఎరుగకుండెను (1 కొరింథీ 1:16). అతడు పరిశుద్ధాత్మ ప్రేరేపణ వలన మాటలాడినను, థెస్సలోనీకయులో నున్న సహోదరుల విశ్వాసమును గూర్చి తెలిసికొనుటకు అక్కడకు పంపవలసి వచ్చెను. దేని నిమిత్తమైతే దివ్యప్రేరణ ఈయబడెనో అంతమట్టుకు మాత్రమే అది పరిమితి

అయ్యుండెను : అనగా దైవాధికారము చొప్పున కొన్ని అంశముల మేరకు దైవసత్యమును ప్రసారము చేయుటకే పరిమితి అయ్యుండెను. పౌలును శారీరక బాధలనుండి విడువబడిన వానిగా గాని లేక శ్రేష్ఠమైన గుడారములు తయారు చేయువానిగా గాని దివ్య ప్రేరణ చేయలేదు. దివ్య ప్రేరణగల మానవులు ఉపదేశకులు, లేఖకులుగా దేవుని తరపున మాట్లాడువారిగా ఉన్నప్పుడు మాత్రమే పొరపాటు పడని వారు. అది ఎందు నిమిత్తమీయబడెనో దాని నిమిత్తము మట్టుకు పరిమితి చేయబడెను. దివ్య ప్రేరణ వలన వారు ఖగోళ శాస్త్రజ్ఞులుగాని, వ్యవసాయదారులుగాని కాలేదు. వారి జీవన విధానములో పాపము చేయలేని వారిగ అది వారిని తయారు చేయలేదు. యోషీయాను గూర్చి, అతని పనిని గూర్చి యూదానుండి వచ్చిన దైవజనుడు ఆశ్చర్యకరమైన ప్రవచనమును పలికెను. అయినను అతడు తన యింటికి తిరిగి వెళ్ళకముందు తన పాపమును గూర్చి మృతి బొందెను (1 రాజులు 13). దావీదు దుఃఖకరముగా పాపము చేసెను (2 సమూయేలు 12). పేతురు ప్రభువును ఎరుగననెను, ఇతరులకు ప్రకటించిన తరువాత తాను భ్రష్టుడనై పోదునేమో యని పౌలు జాగ్రత్తపడెను (1 కొరింథీ 9:27). అది యెత్తి చెప్పు మాటల యథార్థతను దివ్య ప్రేరణ రూఢీపరచదు. సాతానుడు పలికిన కొన్ని మాటలను, దివ్య ప్రేరిత లేఖకులు యెత్తి చూపించిరి. ఉదాహరణకు : "మీరు చావనే చావరు" (ఆది 3:4). అపవాది ఈ మాటలను చెప్పుట నిజమేగాని అది చెప్పిన మాటలు నిజముకాదు. దివ్య ప్రేరణ ఎన్నడు అబద్ధమాడదు. అయినను అబద్ధమాడినవారి మాటలను అది కొన్నిసార్లు రికార్డు చేసెను. "1 సమూయేలు 31:3, 4లో సౌలు తన్నుతాను చంపుకొనెనని బైబిలు చెప్పుచున్నది. అయితే 2 సమూయేలు1:1-10లో 'అమాలేకీయుడనని చెప్పుకొను యువకుడొకడు, తనకు బహుమానమేదైనా దొరకునని ఆశించి తాను సౌలును హతమార్చెనని దావీదుతో

చెప్పినట్లు బైబిలు చెప్పుచున్నది. ఇది అసత్యము. ఈ అమాలేకీయుడు సౌలును హతము చేసినట్లు బైబిలు చెప్పుట లేదు గాని అతడు సౌలును చంపినట్లు దావీదుతో చెప్పిన వాస్తవమును గూర్చి అది చెప్పుచున్నది. 1 సమూ 31:3, 4 ప్రకారము అతని వృత్తాంతము అబద్ధము. అయినను అతని వృత్తాంతమును గూర్చిన రికార్డు దివ్య ప్రేరితమైనది, సత్యమైనది" (Miller). (మిగతా వచ్చే సంచికలో)

---

## తీర్పు దినము

## *( The Judgment Day )*

"మనుష్యు లొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). అందు నిమిత్తము క్రీస్తు మృతులలో నుండి లేపబడెను" (అపో. కా. 10:42; 17:31).

### 1. ఆ దినమందు కొన్ని ప్రాముఖ్య ప్రశ్నలు :—

A. నీవు క్రీస్తు సువార్తకు ఎందుకు లోబడ లేదు ?

1. ఈ నిత్య హెచ్చరికలను గమనించుము : 2 థెస్స 1:8, 9; 1 పేతురు 4:17; రోమా 1:16.
2. బైబిలు ఇప్పుడు అందుబాటులో యున్నందున, మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క సువార్తకు లోబడని వాడు ఆ గొప్ప ఆఖరి దినమందు ఏమి చెప్పగలడు ?
3. ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని దేవుడు కోరుచున్నాడు (2 పేతురు 3:9). ప్రతి మానవుని కొరకు యేసుక్రీస్తు మరణము అనుభవించెను (హెబ్రీ 2:9).

B. నీవు ప్రభువు కొరకు ఏమి చేసితివి ?

1. క్రైస్తవుడు తన కప్పగింపబడిన బాధ్యతను గూర్చి లెక్క అప్పగించవలెను (మత్తయి 25:34-45).

2. "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తి హీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి. . . ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండ వలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:11-13).

a) సమస్త పాపము నుండి మనము వైదొలగవలెను. అట్లయిన మనము :

b) స్వస్థబుద్ధితో జీవించవలెను — నిన్ను నీవే కాపాడుకో.

c) నీతితో జీవించవలెను — నీ పొరుగు వానిని సరిగ ఆదరించు.

d) భక్తితో జీవించవలెను— దేవుని యెడల సరిగ ప్రవర్తించు. అట్లుండవలెనని మానవుడు దేవుని చిత్తమును తెలిసికొని, దానికి లోబడి, మరణమువరకు దాని ప్రకారము జీవించుట అత్యవసరము.

3. క్రీస్తు సువార్తకు విధేయులైన తరువాత ప్రభువు కొరకు జీవించకుండా యున్నవారికి తీర్పు దినము బహు విచారకర మైనది.

ఒక గొప్ప దినము రాబోవు చున్నది!!

## 2. తీర్పుయొద్ద కొన్ని దృశ్యములు :

A. ఎన్నడు లేనంత గొప్ప జనసమూహము అక్కడ ఉండును.

1. ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే, చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10).

2. ఆదామునుండి ఈ కాలాంతము వరకు యున్న అన్నిజాతుల వారు అక్కడ యుందురు.
3. అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు అక్కడ ఉందురు. యూదా ఇస్కరియోతు, జార్జి వాషింగ్‌టన్, గాంధీ నెహ్రూలు అక్కడ ఉందురు. నీకు అత్యంత ప్రాముఖ్యమైన సంగతి యేమంటే నీవు అక్కడ ఉందువు. ఎంత గొప్ప జన సమూహమో !

B. ఏ సింహాసనము మీద ఎన్నడు కూర్చొనలేని గొప్ప న్యాయాధిపతి అక్కడ ఉండును :

1. "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియల చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నాయొద్ద ఉన్నది" (ప్రకటన 22:12).
2. "ఇక మీదట నా కొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును" (2 తిమో 4:8).
3. ఈ లోకములో న్యాయము జరుగుటకు అనేక సంగతులు అభ్యంతరము కలుగజేయును. ధనము, రాజకీయ పలుకుబడి మొదలగునవి కొన్ని సందర్భములలో మన న్యాయ సభలలో అడ్డువచ్చును. అయితే ఆ తీర్పు దినమందు అది అట్లు కానేరదు.
4. ప్రతివాడును అక్కడ నిలబడును. అతడు నల్లవాడేమి, తెల్లవాడేమి, ధనికుడేమి, ధనహీనుడేమి అక్కడ నిలబడును. ప్రతివానికి న్యాయము తీర్చబడును గాని కనికరము కాదు. కనికరము చూపు దినము అప్పటికి గతించిపోవును. ఆ దినము కొరకు నీవు సంసిద్ధుడవా?

C. గొప్ప గ్రంథములు విప్పబడును :

1. "మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను; మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:12).

2. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48).

3. ఎంత గొప్ప గ్రంథముల కలయికయో! "గ్రంథములు"— బైబిలునందలి పాత క్రొత్త నిబంధన గ్రంథములు. "జీవ గ్రంథము" -- మానవ చరిత్రగల పరలోక రికార్డు.

4. బైబిలులో ఇప్పుడేమి వ్రాయబడి యున్నదో అప్పుడుకూడ అదే వ్రాయబడి యుండును. ఈ దిగువ లేఖన భాగములను నీవు లోబడితివో లేదో జీవగ్రంథము ఏమి చెప్పుచున్నది? హెబ్రీ 11:6; లూకా 13:3; రోమా 10:10; మార్కు 16:16; అపో.కా. 2:38; 22:16; యోహాను 3:5.

D. గొప్ప ఎడబాటు అక్కడ కలుగును.

1. గొర్రెలు కుడివైపునను, మేకలు ఎడమవైపునను ఉంచబడును. ఆ దినమందు నీవు ఎక్కడ ఉంచబడుదువు? (మత్తయి 25:31-46).

2. తండ్రి ఒక ప్రక్క, తల్లి వేరొక ప్రక్క ఉందురు; సహోదరుడు ఒక ప్రక్క, సహోదరి వేరొక ప్రక్క ఉందురు; భర్త ఒక ప్రక్క, భార్య వేరొక ప్రక్క ఉందురు. తలిదండ్రులు ఒక ప్రక్క, బిడ్డలు ఒక ప్రక్క యుందురు.

3. ప్రభువులో ఇప్పుడు అందరు రక్షింపబడి ఏకముగా నిలబడ వచ్చును.

4. తీర్పు దినమందు కలుగు ఎడబాటు అంతులేనిది. అది నిత్య ఎడబాటు.

E. గొప్ప తీర్పు ప్రకటించబడును :

1. "వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:46).

2. ఈ లేఖన భాగములను జాగ్రత్తగా చదువుము : లూకా 16:19-31; 12:5; ప్రకటన 20:14-15; మార్కు 9:47, 43; ప్రకటన 14:11; 21:3; 22:1-7; యోహాను 14:1-3.

## III. అప్పుడు మన మేమి చేతుము ?

మన పట్టణములో యున్న కారాగారము లన్నియు వాటి ఆఖరి పనిని సంపూర్తి చేసిన తరువాత, వ్యాపారులు తమ పట్టువస్త్రములోని ఆఖరి మీటరు నమ్మివేసి, తమ ఆఖరి గుమాస్తాను పంపివేసిన తరువాత, బ్యాంకు లన్నియు తమ ఆఖరి రూపాయితో సహా వడ్డీని చెల్లించివేసిన తరువాత, ఈ లోక న్యాయాధిపతి "రాత్రికి మూసివేయ బడెను" అని చెప్పి లెక్కలు అడిగిన యెడల అప్పుడు మనమేమి చేతుము ? సంఘము తన ఆఖరి గీతమును పాడిన తరువాత, బోధకుడు తన ఆఖరి ప్రార్థనను చేసిన తరువాత, ప్రజలు తమ ఆఖరి ప్రసంగమును వినిన తరువాత, గాలిలో ఇక శబ్దము లేకపోయినప్పుడు, ఆరాధనస్థల మంతయు నిర్జన మైనప్పుడు గొప్ప గ్రంథములు విప్పబడగా ప్రతివాడు తన జీవిత రికార్డును ఎదురుగా చూచునప్పుడు మన మేమి చేతుము ?

మీ వూరిలో యున్న క్రీస్తు సంఘారాధనలకు హాజరు కమ్ము !!

—W. A. బ్రాడ్‌ఫీల్డ్.

# క్రీస్తు ప్రభుని జన్మదినం

క్రీస్తు ప్రభుని జన్మదినం
కఠినుల హృదయాలను
కదలించి వేసిన శుభదినం.

ఆ నాడు....

కలిమి గలిగిన ఆ సుతుడు, లేమిలో చోరబడి
కరుణా కటాక్షము, ఏది చూపలేని ఒక తొట్టిలో
కాళ్లు చాపుటకు గూడ, నోచుకోలేని ఇరుకులో
కలగాపులగముగా కలసిన, అడ్డు గడ్డి పుల్లల మధ్యలో
కదలి వచ్చాడు ఈ లోకానికంటే, కనుగొనలేని వింతకదా!
కలగాని నిజమైన ఈ వింత, చింతలు దీర్చదా మరి!
కనిపెట్టి వచ్చి కాంచిన జ్ఞానులకు, కండ్లార చూచిన గొల్లలకు
కనకమును కాళ్ళముందుంచి, సాంబ్రాణి బోళమును సమర్పించే
కమనీయమైన సమయం కలసిరావడం, అదృష్టం కదా?
కనుగొనలేని హేరోదు మహారాజు, కిరాతకుడైన ఆ దుష్టుడు
కఠినమైన కసాయితనం అమలుపర్చడం, దురదృష్టం కదా?
కాకపోతే ఎంత అన్యాయం! కన్నతల్లుల హృదయాలను గాయపర్చడం
కండ్లు విప్పని పసిపాపలను, కరకరా తరిగే కత్తులకు, పదును పెట్టడం.

ఈ నాడు....

క్రైస్తవ సోదరులు కొందరు, ఏకాన్త యోచనచేయలేనిస్థితిలో వుంటూ
కమ్మని వంటకాలు, ఖరీదైన కంచి పట్టు వస్త్రాలతో, తిరుగుచు
కంఠంవరకు ఆభరణాలతో, మత్తు పానీయాలతో,

కటకట లాడించే హృదయాలతో, క్రైస్తవ్యాన్ని మరిపించే
సన్ని వేశాలతో
కదలుచూ యున్నారు; అపవాది యుక్తిలో, నలగుచు వున్నారు నీడ
లేని గురిలో.
కన్యకు బుట్టిన ఆనాటి సుతుడు, గంభీర బూర ధ్వనితో మరల
రానై యున్నాడు;
కదలి వచ్చేది నిజం, కనుగొనలేని సమయంలో, గంభీరుడై ఒకనాడు.
కర్తవ్యాన్ని విస్మరింపక, క్రీస్తు ప్రభుని రాకడపై గురి నిలిపి జీవిం
చిన వారికి
కలకాలం కమ్మగా జీవించే రాజ్యములో చోటు, జీవగ్రంథమందు పేరు.
కాదులే లేదులే అంటూ క్రీస్తు రాకడ ఎప్పుడోనంటు, చప్పరిస్తు నడిస్తే
కలసి వచ్చే ఫలితం ఆరని అగ్ని, తీరని వేదన, పళ్లు పటపట, నిప్పులో
కటకట.
కాస్త యోచించు సోదరుడా, కడవరి దినాల్లో శుభదినం ఒకటుందని
అదే ఆఖరి దినం అని.

—G. మార్కు, బెంగుళూరు.

---

## పర్వతములు పడునప్పుడు

## *( When the Mountains Fall )*

వారు "సింహాసనాసీనుడై యున్న వాని యొక్కయు, గొర్రె పిల్ల యొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు? మీరు మామీద పడి ఆయన సన్నిధికిని గొర్రెపిల్ల ఉగ్రతకును మమ్మును మరుగు చేయుడి అని పర్వతములతోను బండలతోను చెప్పుచున్నారు" (ప్రకటన 6:17).

అమెరికాలో St. హెలెన్స అను అగ్నిపర్వతము బ్రద్దలై ఇప్ప

టికిని ఒక సంవత్సరమునకు పైగా అయిపోయింది. ఆ ఏకైక ప్రేలుడు యొక్క ఘోర ఫలితములు ఇప్పటి కింకను మనలను ఆశ్చర్య చకితు లను గావించుచున్నవి. 50 మెగాటన్నుల బాంబుల శక్తితో ప్రేలుచు అది 150 చతురపుమైళ్ల విస్తీర్ణము గల ప్రదేశమును నిర్జనాత్మకముగ, నిష్ఫలముగ చేసివేసింది. భూమిమీద జీవించు ఒక్కొక్కనికి ఒక టన్నుతో సమానముగ వచ్చు చెత్త చెదారమును అది వెలికి తెచ్చింది. మూడంతస్థుల ఎత్తుగల పెద్ద పెద్ద బండలను గాలిలోనికి విసరివేసింది. గంటకు 800 మైళ్ళ వేగముతో వీచు 'రాళ్ళ గాలి' పెద్దపెద్ద మాన్రిను లను అగ్గిపుల్లలుగా విసరివేసింది. 425 డిగ్రీల ఫారన్ హీట్ ఉష్ణోగ్రత గల 3 బిలియన్ గ్యాలన్ల నీరు గాలిలోనికి ఆ పర్వతము ఊదివేసింది యని ఇంజనీర్లు లెఖ్ఖ కట్టారు.

అడవులు, పంటలు, నదులు, జంతువుల యొక్క నాశనము లెఖ్ఖకట్టలేనంతటి దాయెను. St. హెలెన్స్ పర్వత శిఖర స్థానమునకు దగ్గరగా మకాము ఉన్న ప్రజలు కేవలము తునాతునకలై పోయిరి, మరియు దానికి 15 మైళ్ళ దూరములో యున్నవారు ఊపిరి తిరుగక చనిపోయిరి. దానికి అయిదు మైళ్ళ దూరములో యున్న ఒక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు తన రేడియోలో "వేంకూవర్, వేంకూవర్, ఇదే అది!" అని చెప్పెను. అవి అతని ఆఖరి మాటలు. ఏలయనగా అతడు తన కారుతో సహా మాయమై పోయెను. 1980 మేనెల 18వ తేదీ ఈ అగ్ని పర్వతము మనుష్యులపై పడిన దినము. దాని నెవరు మరచిపోగలరు?

## ఉగ్రత దినము

ప్రకటన గ్రంథములో యోహాను అట్టి ఒక భయంకర దినము యొక్క దృశ్యమును మనకు వర్ణించి యున్నాడు. ఆనాడు మాన వులు పర్వతములు తమపై పడవలెనని నిజముగా ప్రార్థింతురు. "మీరు మామీద పడుడి, మమ్మును మరుగు చేయుడి, సింహాసనాసీనుడై యున్నవాని యొక్కయు, గొర్రెపిల్ల యొక్కయు ఉగ్రత మహాదినము

వచ్చెను, దానికి తాళజాలిన వాడెవడు?" అని వారు ప్రలాపింతురు. తీర్పునాడు కలుగు శిక్షకంటె మరేదైనాసరే చివరకు ఒకనిపై పర్వతము పడుటైనాసరే భరింప శక్యమైనది యని ఈ లేఖనభాగము సూచించుచున్నది!

## నిరాశ విజ్ఞాపన

ఆ దినమును గూర్చి యోహాను చేసిన వర్ణనలో సమాజము లోని ప్రతివారు అనగా భూరాజులు, ఘనులు, సహస్రాధిపతులు, ధనికులు, బలిష్ఠులు, ప్రతిదాసుడు, ప్రతి స్వతంత్రుడు ఇమిడి యుండిరి. ఒకడు ఎంత స్వతంత్రుడైనను లేక దాసుడైనను, ఎంత ఘనుడైనను లేక ఘనహీనుడైనను అతడు సర్వజ్ఞాని యొక్క పరిశోధనలో పాల్గొనును.

నాశనమైపోవుచున్న ఈ జనసమూహముల విజ్ఞాపన ఆసక్తికరముగా యుండుట మనము గమనించగలము: "సింహాసనాసీనుడైన వాని సన్నిధి నుండి మమ్మును మరుగు చేయుడి". ఏదెను వనములో మొదటి పాపులు దేవునికి కనబడకుండా యుండుటకు ఎట్లు ప్రయత్నించిరో (ఆది 3:8), అట్లే ఆఖరి పాపులు కూడా ప్రయత్నించుదురు. పాపము దుష్కార్యము చేయుచు వెలుగును ద్వేషించు వారిని దేవుని నుండి వేరుచేయును (యోహాను 3:20).

వారు తప్పించుకోవాలని ప్రయత్నించిన విధి 'గొర్రెపిల్ల యొక్క ఉగ్రత'. గొర్రెపిల్లకంటె సాధువైనది, మృదువైనది, ఉగ్రత అన్నకు వ్యతిరేకమైనది ఇంకొకటి యేమున్నది? అయినను ఆ దినమందు గొర్రె పిల్లయే పగ తీర్చుటకు, ప్రతి దండన చేయుటకు ముందుగా వచ్చును. లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లయైన యేసు, తన శరీరములో మన పాపములను భరించిన యేసు, మనకు స్వతంత్రము కలుగునట్లు తాను పట్టుబడిన యేసు, మనము విమోచింపబడునట్లు గాయపరచబడిన యేసు ఆ దినమందు అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై

ప్రతి దండన చేయును (2 థెస్స 1:8). ఆయన రక్తపు విమోచనను నిరాకరించువారు ఆయన ప్రతి దండన భారమును భరించవలసిందే.

## పర్వతములు పడు దినము

పర్వతములు పడు ఆ దినమందు ఈ దిగువ సంగతులు జరుగును :

1. యేసు దూతల సమూహముతో మేఘారూఢుడై వచ్చును (ప్రకటన 1:7; మత్తయి 25:31).

2. భూమియు దానిమీద నున్న కృత్యములును అకస్మాత్తుగా నాశనము గావించబడును (2 పేతురు 3:10, 11).

3. సమాధులు తెరువబడును, మృతులైన వారందరు లేప బడుదురు (యోహాను 5:28, 29; 1 కొరింథీ 15:51, 52).

4. దేవుని న్యాయపీఠము స్థిరపరచబడును (2 కొరింథీ 5:10; ప్రక 20:11, 12). ప్రతివాడును తాను భూమి మీద జరిగించిన కృత్యములను బట్టి తీర్పు పొందును.

5. మానవులందరి అంత్యగతి నిర్ణయించబడి ముద్రించబడును; నీతిమంతులు పరలోకపు నిత్యానందములోనికి, దుష్టులు నరకాగ్ని లోనికి ప్రవేశింతురు (2 థెస్స 1:7; మత్తయి 25:46; ప్రకటన 20:15; 21:8).

1930 మే 18 నాడు పర్వతముల యొక్క ఒక భాగము అమెరికాలోని ఒక రాష్ట్రములో అంత వినాశము, వేదన కలిగించిన యెడల, పర్వతము లన్నియు పడు ఆదినము ఎంత భయంకరముగా యుండునోగదా! —పాల్ రోజర్స్

---

## క్రీస్తు సంఘ సభ్యులు కాకుండ రక్షణ పొందగలమా?

ప్రపంచము నందలి భక్తిగల ప్రజలు, భారత దేశములో గల వివిధ మతస్థులు, తమ తమ మత నియమములను, సిద్ధాంతములను పాటించిన యెడల మోక్షము పొందగలమని నమ్ముచున్నారు. అనగా

మంచి కార్యములచేత ఒకడు మోక్షము సంపాదించవచ్చునని వారి భావము.

అదే విధముగా మన దేశములోను, ప్రపంచమంతటను గల మతశాఖల ప్రజలు (కేథలిక్కులు, ప్రొటెస్టాంటులు) వారి వారి శాఖల సిద్ధాంతములను, బోధలను అనుసరించిన యెడల రక్షణ పొందగలమని నమ్ముచున్నారు. అనగా దేవునియందు విశ్వాసమున్నంత వరకు వారు ఏ శాఖకు సంబంధించినవారైనను పరవాలేదని వారి భావము.

అయితే మానవ రక్షణకు మరియు సంఘ సభ్యత్వమునకు గల సంబంధమును గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నదో పరిశీలింతము.

## I బైబిలు సంఘము మరియు మానవుల రక్షణ :

A. దేవుడు బైబిలునందు ఒక సంఘమును తెలియజేశాడు. (మత్తయి 16:18; రోమా 16:16).

B. క్రీస్తు ఆ సంఘమునకు శిరస్సైయున్నాడు. (ఎఫెసీ 1:22, 23; 4:16; కొలస్స 1:18).

C. క్రీస్తు ఆ సంఘమునకు రక్షకుడై యున్నాడు. (ఎఫెసీ 5:23; కొలస్స 1:18, 24).

D. రక్షింపబడిన వారిని క్రీస్తే తన సంఘమునకు లేక రాజ్యమునకు చేర్చును (మార్కు 16 : 16; అపొ.కా. 2:41, 47; యోహాను 3:3-5).

E. ఆ సంఘము లేక రాజ్యము క్రీస్తు రక్తముచే కొనబడెను. (అపొ.కా. 20:23; ప్రకటన 1:6; 5:10; ఎఫెసీ 5:27).

F. క్రీస్తు సంఘము దేవుని యొక్క కుటుంబము లేక మందిరమై యున్నది (1 తిమోతి 3 : 14, 15; 1 పేతురు 2 : 4, 5; హెబ్రీ 3:6).

పై విషయములు మనసునందుంచుకొని ఈ దిగువ ప్రశ్నలను పరిశీలించుము.

1. సంఘములో లేనివారు రక్షింపబడ్డారా? (అపొ.కా. 2:47).
2. సంఘములో లేనివారు క్రీస్తు రక్తములో తమ పాపములు కడిగి వేసుకున్నారా? (అపొ.కా.22:16; 20:28; 1 పేతురు 2:21-25).
3. క్రీస్తు సంఘములో లేనివారు పరలోక రాజ్యములో నున్నారా? (యోహాను 3:3-5; అపొ.కా. 2:41, 47; 20:28; ప్రకటన1:6; 5:10).
4. సంఘములో లేనివారు క్రైస్తవులా? (అపొ.కా. 11 : 26; 1 కొరింథి 12:12-27).

అయితే రక్షింపబడుటకు ఏ శాఖలో నుండినను పరవాలేదని నీవు అనుకొనవచ్చును. మరియు దేవుని యందు విశ్వాసముంచి, బైబిలు చదివి, దేవునికి ప్రార్థన చేస్తే చాలు రక్షింపబడవచ్చునని నీవు తలంచవచ్చును. అలాగైన యెడల బైబిలు లేకనే, క్రీస్తురక్తము లేకనే రక్షణ పొందవచ్చును. అయితే అట్టిది అసాధ్యము. మన రక్షణకు సంఘ సభ్యత్వము ప్రాముఖ్యము కాని యెడల :-

1. దేవుడు బైబిలునందు ఒక సంఘమును ఎందుకు కనుపరచాడు?
2. క్రీస్తు ఆ సంఘము కొరకు ఎందుకు చనిపోయాడు?
3. పరిశుద్ధాత్ముడు ఆ సంఘమును గురించి లిఖించుటకు అపొస్తలులను ఎందుకు ప్రేరేపించాడు?
4. అపొస్తలులు మరియు మొదటి శతాబ్దమునందలి క్రైస్తవులు ఎందు నిమిత్తము ఆ సంఘ సభ్యులయ్యారు? కావున రక్షింపబడ వలయునంటే తప్పక క్రీస్తు సంఘ సభ్యులు కావలెను.

## II క్రీస్తు సంఘ సభ్యులగుట ఎట్లు ?

**A.** సువార్తను వినవలెను (రోమా 10:17; యాకోబు 1:22-25).

**B.** దేవునియందు విశ్వాసముంచవలెను (హెబ్రీ 11:6; యోహాను 8:24; 14:1; యాకోబు 2:14-26).

C. పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను (లూకా 13:3, 5; అపో.కా. 17:30; 2:38).

D. క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను (మత్తయి 10:32,33; రోమా 10:9, 10).

E. బాప్తిస్మము పొందవలెను (మార్కు 16:16; అపో.కా. 2:38; 1 పేతురు 3:21).

చివరిగా వివిధమతస్థులు, మతశాఖల ప్రజలు రక్షింపబడ వలయునంటే వారి వారి మత సిద్ధాంతములను వదలి బైబిలునందు దేవుడు కనుపరచిన సంఘ సభ్యులు కావలెను. ఆలాగు చేసి, పరలోక మందు దేవునితో నిత్యజీవము ననుభవింప వలయునంటే మరణము వరకు విశ్వాసనీయమైన క్రైస్తవ జీవితము జీవించవలెను (ప్రకటన 2 : 10).

—D. ఎలీషా, గోవా.

---

# దేవుని మందిరము

దేవుడు తన ప్రజలైన ఇశ్రాయేలీయులను ఐగుప్తు దాసత్వము నుండి విడిపించి తాను వాగ్దానము చేసిన కానానుకు నడిపించునప్పుడు ఆయన సన్నిధి వారితో నుండగోరి ప్రయాణములో మోసికొని వెళ్లుటకు అనుకూలముగా నుండగల ఒక గుడారము (ప్రత్యక్షపు గుడారము)ను సిద్ధము చేయుమని తాను ఏర్పరచుకొనిన మోషేకు ఆజ్ఞాపించెను. దేవుడు తనకు ఆజ్ఞాపించినట్లు మోషే దేవుని నివాసమునకై గుడ్డతో చేయబడిన గుడారపు మందిరమును సిద్ధపర్చెను. 40 సంవత్సరములు దేవుడు ఆగుడారములో వారితో ఉండి యిశ్రాయేలీయులను పాలు తేనెలు ప్రవహించు కానాను దేశమునకు నడిపించెను (నిర్గమ 25:8-40; 26:1-6).

ఇశ్రాయేలీయులు కానాను దేశము చేరినతర్వాత దేవుడు తన నివాసమునకై ఒక మందిరమును కట్టుమని దావీదు కుమారుడైన

సొలొమోను రాజునకు ఆజ్ఞాపించి ఆమందిరము యొక్క కొలత లన్నియు తానే యిచ్చి యెరూషలేము పట్టణమందు ఒక గొప్ప మందిరమును ఆయనచే కట్టించుకొనెను. ఆ మందిరమును ఘనపరచి, దానిని ప్రతిష్ఠించిన దినమందు రాజును, ఇశ్రాయేలీయులందరు 22000 ఎడ్లు 1,20000 గొర్రెలు వధించి మందిరమును ప్రతిష్ఠించిరి (1 రాజులు 8:63).

కాలము పరిపూర్ణ మైనప్పుడు దేవుడు తన కుమారుని యీ లోకమునకు పంపి ఆయనద్వారా లోకమును రక్షింపగోరెను. క్రీస్తు నరావతారియై యీ లోకమునకు వచ్చి 33½ సంవత్సరములు జీవించెను. తాను జీవించిన కాలములో ఒక దినమందు యెరూషలేమునకు వెళ్ళి అక్కడ కట్టబడి వున్న ఆ గొప్ప దేవాలయములో ప్రవేశించగా అక్కడ జరుగుచున్న వ్యాపారమును చూచి సహించలేక రౌద్రుడై రూకలు మార్చువారి బల్లలను పడద్రోసి, ఎడ్లను గొర్రెలను కొరడాలతో తరిమివేసి నా తండ్రి మందిరమును దొంగల గుహగాను వ్యాపారపుటిల్లుగా చేసితిరని చెప్పెను (మత్త 21:12-13).

అయ్యో అంతటి శాంతమూర్తియైన క్రీస్తు ఇంత కోపోద్రేకుడగుటకు గల కారణమేమి? ఆయన జీవించిన కాలములో ఇది తప్ప మరి ఎప్పుడును ఇంతగా కోపగించినట్లు వ్రాయబడలేదు. తనను యెరూషలేము వీధులలో హీనముగా నిందించి, హింసించి, కొరడాలతో కొట్టి ముఖముపై వుమ్మివేసి, అవమానపరచినప్పుడైన, తన చేతులలోను, కాళ్ళలోను పెద్ద మేకులతో సిలువ మ్రానుకు దిగగొట్టినప్పుడైన కోపగించక, తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు, వీరిని క్షమించుమని ప్రార్థించిన శాంతమూర్తికి యిప్పుడేల యింతటి కోపము వచ్చెనో ఆలోచించుడి. తన తండ్రి మందిరము విషయమైన ప్రేమాపేక్షయే కారణము.

యీ అంత్య దినములలో దేవుడు తన మందిరమును నిర్జీవమైన రాళ్ళతో గాక సజీవమైన రాళ్ళతో తన ప్రియ కుమారుడైన క్రీస్తు

ద్వారా నిర్మించి యున్నాడు. దాదాపు 2000 సంవత్సరముల క్రితము క్రీస్తు దానికి పునాది వేసి యున్నాడు. నేటికిని ఆ పని కొనసాగుచునే వున్నది. ఆ మందిదము నిర్మించు నిమిత్తమై ఆయన తన అమూల్యమైన రక్తమును చిందించి దాని ప్రతిష్ఠ నిమిత్తము తన ప్రాణము పెట్టెను. అది ఆత్మీయమైన సంఘము. మనమే జీవముగల ఆ దేవుని మందిరము (2 కొరంధి 6:18; హెబ్రీ 3:6). ఆయనయందు విశ్వసించిన సంఘమే దేవుని మందిరమై యున్నది (1 కొరింధి 3:17).

అనేకులు దైవమందిరమైన ఆయన సంఘమును గుర్తించక నిర్లక్ష్యముగా వుండుట దేవుని ఉగ్రతకు పాత్రులగుటకే యని గుర్తించుట మంచిది.

—బి. లాజరస్, సజీవపురము.

---

*From*
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA-533 001

**Printed Book only**

**To**

..............................................
..............................................
..............................................
..............................................